www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 నవంబర్ 2022

ఎస్వీబీసీ డైరెక్టర్‌గా మంగ్లీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) డైరెక్టర్‌గా ప్రముఖ సింగర్ మంగ్లీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే డైరెక్టర్‌గా మంగ్లీ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా మంగ్లీ పాడిన పాటలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ నేపథ్యంలో మంగ్లీని డైరెక్టర్‌గా నియమిస్తూ జగన్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

సింగర్ మంగ్లీ

'లీజు' పేరుతో మోసం

- రూ.3 కోట్ల భూమిని అప్పనంగా నొక్కేశారు
- లబోదిబోమంటూ కలెక్టర్ వద్దకు దళితులు
- ఏడేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రూ.3 కోట్ల రూపాయలు విలువ చేసే దళితుల భూములను పేరూరుకు చెందిన గోపాల్ అనే వ్యక్తి అప్పనంగా కొట్టేశారు. ఐదేళ్ల పాటు లీజు పేరుతో 15 ఎకరాలను తీసుకున్న గోపాల్ లీజు ముగిసిందని, మరోసారి లీజుకు ఇవ్వాలని మోసం చేసి తనకు అమ్మినట్లుగా డాక్యుమెంట్లు సృష్టించి కొట్టేశాడు. ఆ గ్రామానికి చెందిన దళితుడు ఒకరు చనిపోవడంతో దహనక్రియలకు వారి భూముల్లోనే చేయాలని వెళ్లడంతో 'ఆ భూములను మీరు ఎపుడో అమ్మేశారు' అంటూ గోపాల్ వారిని అడ్డుకున్నాడు. దీంతో విషయం వెలుగులోకి వచ్చి దళితులు లబోదిబోమంటున్నారు. 2015 నుంచి ఇప్పటివరకు కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా ఫలితం లేకపోవడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని 'స్పందన' కార్యక్రమంలో కలిసి తమకు జరిగిన మోసాన్ని విన్నవించుకున్నారు. బాధితుల వివరాల మేరకు...

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం చెట్టేవారిపల్లికి చెందిన పది మంది దళిత కుటుంబాలకు సర్వే నంబర్ 290/1ఇ, 297/7, 291/1, 294/4, 297/6, 290/1ఎఫ్ తదితర సర్వే నంబర్ల కింద ఎం.సిద్దలక్ష్మి, డి.క్రిష్ణమ్మ, ఎన్.గంగులమ్మ, ఇ.సుబ్బలక్ష్మి, ఇ.మల్లీశ్వరి, భూదేవి, సరస్వతి, పి.రెడ్డెమ్మ తదితరులకు 1991లో ప్రభుత్వం డికెటి భూములను ఇచ్చింది. చెట్లుపుట్ట చదును చేసుకున్న దళితులు ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బోర్లు వేసుకుని పంటలు పండించుకుంటూ ఉన్నారు. వర్షాధార ప్రాంతం కావడంతో నీళ్లు సరిగ్గా రాకపోవడంతో 15 ఎకరాల్లో వరుసగా మామిడిచెట్లు నాటారు. నిర్వహణ బాధ్యత కష్టం కావడంతో పేరూరుకు చెందిన గోపాల్‌కు 2010లో లీజుకిచ్చారు. ఐదేళ్ల లీజుకు ఒక్కొక్కరికి లక్షా 30వేలు ఇచ్చారు. 2015లో లీజు గడువు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో గోపాల్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి 'లీజు రెన్యువల్' అని చెప్పి వారి దగ్గర తనకు అమ్మినట్లుగా సంతకాలు చేయించుకున్నాడు. చుట్టూరు కంచె వేసుకున్నాడు. సరస్వతికి చెందిన బంధువులు 2015లో చనిపోవడంతో తమ పొలంలో పూడ్చుకోవాలని ప్రయత్నించారు. అయితే అప్పుడు అసలు విషయం బయట పడింది. తనకు ఆ పొలమంతా రాసిచ్చారని, అది తనకు అమ్మేశారని, పూడ్చడానికి వీల్లేదని అడ్డుకున్నాడు. విఆర్‌ఒ, తహశీల్దార్ల దగ్గరకు వెళ్లి తమ గోడు వినిపించారు. సంతకాలు చేశారని, మేం ఏమీ చేయలేమని వారు చేతులెత్తేశారు. దళితులకు ఇచ్చిన భూములను ఎలా తీసుకుంటారని, తమను మోసగించిన విషయాన్ని డిఆర్‌ఒ శ్రీనివాసులకు వివరించారు. పూర్వాపరాలు తెలుసుకుని న్యాయం చేస్తామని డిఆర్‌ఒ హామీ ఇచ్చారు.

డిఆర్‌ఒకు తమకు జరిగిన మోసాన్ని విన్నవించుకుంటున్న బాధితులు

మోసం చేసి తీసుకున్నారు : సరస్వతి, బాధితురాలు

లీజు అగ్రిమెంట్ పేరుతో మా దగ్గర రెండోసారి సంతకాలు తీసుకున్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మేము అమ్మినట్లుగా మోసం చేశారు. ఆ భూమే మాకు జీవనాధారం. ప్రస్తుతం ఆ భూమి ఎకరా 18 లక్షలు పోతుంది. దాదాపు 3 కోట్ల రూపాయల భూమిని మోసం చేసి లాక్కున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలి.

దళితుల భూమి లాక్కునే హక్కు ఎవరికీ లేదు : మల్లీశ్వరి, బాధితురాలు

1991లో పది కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం 15 ఎకరాల భూమిని కేటాయించింది. మేమంతా చదును చేసుకుని అప్పోసప్పో చేసి బోర్లు వేసుకుని పంటలు పండించుకుంటూ వచ్చాం. జీవనం గడిచేది ఇబ్బంది గా ఉండడంతో మామిడి మొక్కలు పెట్టుకుని గోపాల్ అనే వ్యక్తికి లీజుకిచ్చాం. మమ్మల్ని దొంగదెబ్బ తీశారు. మాకు అన్యాయం జరిగింది. దళితుల భూమి లాక్కునే హక్కు ఎవరిచ్చారు?

కులవివక్షను అంతమొందిద్దాం

కేవీపీఎస్ జిల్లా మహాసభలో వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సమసమాజ పురోగతికి ప్రతిబంధకంగా ఉన్న కుల వివక్షను, జాత్యాంహకారాన్ని అంత మొందించేందుకు కలిసికట్టుగా పోరాడాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దేశాండి అరుణాచలం పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో తిరుపతి జిల్లా కేవీపీఎస్ జిల్లా ప్రప్రథమ మహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ, అక్కడే బహిరంగ సభ నిర్వహించారు. తదనంతరం సీఐటీయూ కార్యాలయంలో ప్రారంభించిన మహాసభలను ద్దేశించి అరుణాచలం మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటిపోతున్నా సమాజంలో ఇంకా కుల వివక్ష, జాత్యాహాంకారం సమసి పోలేదని వాపోయారు. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కాక ఎస్సీ ఎస్టీ మైనారిటీలపై కులం, జాతి, మతం పేరిట దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు నిమ్న కులాల హక్కులను కాలరాయడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వందవాసి నాగరాజు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎన్ది శ్రీను, డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, కెవిపిఎస్ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, ముని రమణయ్య, రమేష్, రాజా, వెలివేంద్రం, కుప్పమ్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణాచలం

స్విమ్స్ విద్యార్థులకు మరింత రుచిగా భోజనం : జేఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి : స్విమ్స్‌లోని పారామెడికల్, ఫిజియోథెరపీ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ఆహారం మరింత రుచిగా, నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ జేఈవో సదా భార్గవి అధికారులకు సూచించారు. విద్యార్థులతో సోమవారం సాయంత్రం ఆమె సమావేశం నిర్వహించారు. టిఫిన్, భోజనం, స్నాక్స్ ఎలా ఉన్నాయి అనే విషయంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారి సూచనలు, సలహాలు, సమస్యలను విన్నారు. ఆహారం గురించి విద్యార్థుల నుంచి ఫిర్యాదు రాకూడదని చెప్పారు. వార్డన్లు, అధికారులు తరచూ వంటశాల, భోజన శాలను పరిశీలించాలని, విద్యార్థులతో మాట్లాడి వారి ఇబ్బందులు ఏమైనా ఉంటే తెలుసుకోవాలని చెప్పారు. భోజనం శ్రీవేంకటేశ్వర స్వామి వారు అందిస్తున్న ప్రసాదమనే భావన వారిలో ఏర్పరచి వృధా కాకుండా చూడాలని ఆమె సూచించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, టీటీడీ అదనపు ఎఫ్ఎ సీఏఓ రవి ప్రసాదు, డిప్యూటీ ఈవో లు గోవింద రాజన్, సుబ్రమణ్యం, స్విమ్స్ జి ఎం లు కోటిరెడ్డి, ప్రసన్నలక్ష్మి, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - తిరుచానూరు : శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆస్థానమండపంలో ఉదయం 5 నుండి 6 గంటల వరకు తిరుపతికి చెందిన లక్ష్మీ సువర్ణ, నాగరాజు బందం మంగళధ్వని, ఉదయం 6 నుండి 7.30 గంటల వరకు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులతో వేద పారాయణం నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు భద్రాచలంకు చెందిన శ్రీ స్థల సాయి ధార్మికోపన్యాసం, ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సేలం చెందిన మెట్టూరు బ్రదర్స్ బందం వారిచే భక్తి సంగీత కార్యక్రమం జరిగింది. అనంతరం మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు తిరుపతికి చెందిన విజయ కుమారి భాగవతార్ హరికథ పారాయణం చేశారు. సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు తిరుపతికి చెందిన మధుసూదన్ రావు బందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాయంత్రం 6.30 నుండి ఎస్వీ సంగీత నత్య కళాశాల విద్యార్థులు బందగానం జరిపారు.

శ్రీవారి మెట్టు వద్ద కార్తీక వనభోజనం

తిరుపతి సిటి : కార్తీకమాసం సందర్భంగా సోమవారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం అనంతరం వనభోజనోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, డెప్యూటీ ఈవోలు వరలక్ష్మి, శాంతి, పార్వతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ వీఎన్ బాబు

ఆన్‌లైన్‌లోనే ఎపిఎస్పిడిసిఎల్ ఇంటర్నల్ ఆడిట్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్ పిడిసిఎల్) పరిధిలోని ఇంటర్నల్ ఆడిట్ విధానంలో విప్లవాత్మక మార్పులను తీసుకురానున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.ఎన్. బాబు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సంస్థ పరిధిలోని అకౌంట్స్ విభాగపు అధికారులు, ఇంటర్నల్ ఆడిటర్స్, ఆడిట్ అసిస్టెంట్లతో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.ఎన్. బాబు, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ ఆర్ డి), ఎన్.వి.ఎస్. సుబ్బరాజు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కె. శివప్రసాద రెడ్డిలు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.ఎన్. బాబు మాట్లాడుతూ మరో రెండు నెలల్లో ఇంటర్నల్ ఆడిట్ ఆన్ లైన్ విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు తెలియజేశారు. నేటి సమాజంలో దినదినాభివద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకుంటూ ఆడిట్ విధానాన్ని సరళీకతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తద్వారా ఆడిటింగ్ ను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేసేందుకు అవకాశం వుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎపిపిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు వై. లక్ష్మీనరసయ్య, కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి –పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఉన్న స్వర్ణముఖి నది నుండి సోమవారం ఇసుకను అక్రమంగా తరలించేందుకు వచ్చిన హిటాచీని గ్రామస్తులు అడ్డగించారు. గత ఆరు నెలల క్రితం టెండర్లు వేసి గవర్నమెంట్ అనుమతి పొందామని వచ్చిన టెండర్ దారులను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఇసుక తరలింపుదారులు వెనుదిరిగారు. తిరిగి మళ్లీ సోమవారం దర్శనం ఇవ్వడంతో సర్పంచ్ కల్పన, వైసిపి నాయకులు, మాజీ సర్పంచులు, టిడిపి నాయకులు ఆధ్వర్యంలో సుమారు 200 మంది గ్రామస్తుల వచ్చి అడ్డగించారు. కొన్ని తరాలుగా స్వర్ణముఖికి ప్రభుత్వం నిర్ణయించిన రహదారి లేదు. రైతులు వారి సొంత అవసరాల కోసం పొలాలకు వెళ్ళుటకు బాటను వదులుకొని, వ్యవసాయ పనులకు ఉపయోగించుకుంటున్న దారి నుండి ఇసుక తరలింపు తగదని గతంలో హెచ్చరించారు. అంతేకాకుండా సుమారు 65 వ్యవసాయ పంపుసెట్లు, 12 గ్రామాలకు తాగునీటి అందించు పంపుసెట్లు ఈ దారి పక్కనే స్వర్ణముఖిలో ఉండడం విశేషం. విషయం తెలుసుకున్న పెళ్లకూరు మండల పోలీస్ అధికారి ఎం.మనోజ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకోగా గ్రామస్తులు ఇసుక తరలింపు వల్ల వచ్చే నష్టాలు, దారి తమ సొంతమంటూ ఆయనకు వివరంగా తెలియజేశారు. మరోసారి ఇసుక తరలింపు ప్రయత్నం జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను గతంలో కలిశామని, మళ్లీ కలుస్తామని ఇసుక తరలింపును ఆపి కొన్ని వేల మంది ప్రజలకు నష్టం జరగకుండా కాపాడాలని వారు తెలియజేశారు.

తిరుపతి జిల్లాలోని వంద గ్రామాల్లో...

'జగనన్న పాల వెల్లువ'కు శ్రీకారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పుత్తూరు టౌన్

తిరుపతి జిల్లాలో మొదటి దశలో వంద గ్రామాల్లో పాల సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకుని, సోమవారం మొదటిరోజు 79 గ్రామాలలో ప్రారంభించామని కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జేసీ, డిసిఒ అధికారులతో పాల సేకరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నారాయణవనం, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో పాల సేకరణను 401 మహిళా రైతుల భాగస్వామ్యంతో 2,435 లీటర్ల పాలను సేకరించి విజయవంతంగా ప్రారంభించామన్నారు. మహిళా పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ఎపి పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య, అమూల్ సంస్థల మధ్య ఒప్పందం కుదుర్చుకుని గ్రామీణ మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుతో పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించనున్నామని వివరించారు. అమూల్ సంస్థ పూర్తిగా రైతులకు సంబంధించిన కో–ఆపరేటివ్ సొసైటీ అని, పాల సేకరణతో వచ్చే మొత్తాన్ని రైతులకు 85 శాతం చెల్లించి, నిర్వహణకు 15 శాతం ఉపయోగిస్తారని, 75 సంవత్సరాల చరిత్రగల సంస్థ అని అన్నారు. జగనన్న పాలవెల్లువ నిర్వహణకు మహిళా పాడి రైతులే 8 నుండి 11 మంది సభ్యులతో సొసైటీ ఏర్పాటు చేసుకుని సేకరణ ప్రారంభిస్తున్నారని అన్నారు. ప్రస్తుత పోటీ పరిస్థితులలో అధ్యయనం చేసిన మేరకు ఒక లీటర్ కు రూ.4 నుండి రూ.15 వరకు అధిక ఆదాయం పాల నాణ్యతను బట్టి అందుతుందని అన్నారు. జేసీ డికె బాలాజీ మాట్లాడుతూ వడమాలపేట మండలం కాయం, నేసనూరు, కదిరి మంగళం ప్రాంతాలలో మహిళా పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, పాల నాణ్యతను బట్టి పాల సేకరణ కేంద్రాలలో ఆటోమాటిక్ రశీదులు రావడం, వారి మొబైల్‌కు మెసేజ్‌లు వెళ్లడం అందులో లీటర్లు, ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ వంటివి వస్తూ అందిన ధరను అప్పటికప్పుడే చూపిస్తున్నదని తెలిపారు.

గ్రామాల్లో పాలవెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ

ఆదరణకు నోచుకోని 'శేషాద్రినగర్' హౌసింగ్ కాలనీ

- ఎంపిపి మోహిత్‌రెడ్డికి బాధితుల మొర
- స్పందించి రూ.కోటి నిధులు మంజూరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పాడిపేట పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ గహకల్ప పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టిన తిరుపతి నగరపాలక సంస్థ ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదని శేషాద్రి నగర్ హౌసింగ్ కాలనీ ప్రజలు వాపోయారు. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సోమవారం పాడిపేట శేషాద్రి నగర్ హౌసింగ్ కాలనీలో గడప గడపకు మహాపాదయాత్ర నిర్వహించిన ఎంపీపీ మోహిత్ రెడ్డికి ప్రజలు తమ గోడును వెళ్ళబుచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవ తీసుకొని హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నారని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పక్కాగా అమలు జరిగేలా కషి చేస్తున్నారని తెలియజేశారు. ఇళ్ల నిర్మాణం నుంచి పూడి రహదారి నుంచి నివాస గహాలకు ఎటువంటి రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. కాలువలు శుభ్రపరచడం లేదని తెలియజేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయి, లబ్ధిదారులకు కేటాయించిన క్రమంలో నిర్వహణ బాధ్యత చేపట్టాల్సిన నగరపాలక అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి లబ్ధిదారు నుంచి రూ.85 వేల చొప్పున రూ.25 కోట్లు చెల్లింపులు రాబట్టిన నగరపాలక సంస్థ నిర్వహణ బాధ్యతలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. పాడిపేట చిన్న పంచాయతీ అని, వార్షిక ఆదాయం తక్కువగా ఉందని సర్పంచి ధనముని తెలిపారు. స్పందించిన ఎంపిపి మోహిత్‌రెడ్డి సౌకర్యాల కల్పనకు కోటి రూపాయల నిధులను అప్పటికప్పుడు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మాధవరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ హేమాద్రిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుమలయ్య పాల్గొన్నారు.

శేషాద్రినగర్‌లో మోహిత్‌రెడ్డి పర్యటన

వర్సిటీల్లో వీసీల విస్తృత తనిఖీలు

విభాగాల వారీగా నాక్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి వర్సిటీలోని పలు విభాగాలను ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. పలు విభాగాలలోని రికార్డులను, నాక్ కమిటీకి సంబంధించిన వివిధ పనులను గురించి ఆరా తీశారు. ఆయా విభాగాలలోని అభివద్ధి పనుల గురించి విభాగాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభంతో సమావేశమై ఆర్ట్స్ కళాశాల పరిధిలో నాక్ కమిటీకి సమర్పించవలసిన వివిధ రికార్డులను, ఇతర అంశాలను, పరిశోధన, అభివద్ధి అంశాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో త్వరలో జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయాలకు గ్రేడింగ్ ఇచ్చేటటువంటి నాక్ కమిటీ పర్యటిస్తున్న నేపథ్యంలో నాక్ కమిటీకి సమర్పించవలసిన అన్ని రకాల రికార్డులను, బోధన, పరిశోధనా అంశాలను గురించి పూర్తిస్థాయిలో గత ఐదు సంవత్సరాల నుంచి రికార్డులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎవరైనా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది డ్యూటీలు సరిగా చేయకపోతే వెంటనే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని హెచ్చరించారు. వర్సిటీ కులసచివులు ఆచార్య ఓఎండి హుస్సేన్ మాట్లాడుతూ విభాగాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం దిశగా కషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంజనీర్ రవీంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం, ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఆచార్యులు సురేంద్ర నాథ్ రెడ్డి, క్యాంపస్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ ఆచార్య ఎ. సుధాకరయ్య, ఆర్ట్స్ కళాశాల ఏవో మణి, అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ ఐఎస్ కిషోర్ పాల్గొన్నారు.

వర్సిటీలో తనిఖీలు నిర్వహిస్తున్న వీసీ కె.రాజారెడ్డి

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున వర్సిటీలోని పలు విభాగాలను ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. పలు విభాగాలలోని రికార్డులను, నాక్ కమిటీకి సంబంధించిన వివిధ పనులను గురించి ఆరా తీశారు. ఆయా విభాగాలలోని అభివృద్ధి పనుల గురించి విభాగాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఉపకులపతి సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌తో సమావేశమై కళాశాల పరిధిలో నాక్ కమిటీకి సమర్పించవలసిన వివిధ రికార్డులను, ఇతర అంశాలను, పరిశోధన, అభివృద్ధి అంశాలను గురించి క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీలో డిసెంబరులోపు జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయాలకు గ్రేడింగ్ ఇచ్చే నాక్ కమిటీ పర్యటిస్తున్న నేపథ్యంలో నాక్ కమిటీకి సమర్పించవలసిన అన్ని రకాల రికార్డులను, బోధన, పరిశోధనా అంశాలను గురించి పూర్తిస్థాయిలో గత ఐదు సంవత్సరాల నుంచి రికార్డులను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

పెద్దిరెడ్డే 'కిరణ్' టార్గెట్

- వ్యూహరచనలో మాజీ ముఖ్యమంత్రి
- తెరవెనుక చక్రం తిప్పనున్న నల్లారి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాజకీయాల్లో శాశ్వత శత్రువుగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డిని టార్గెట్ చేయడమే కిరణ్‌కుమార్ రెడ్డి 2024 వ్యూహంగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఆఖరి ముఖ్యమంత్రి అయిన కిరణ్‌కుమార్‌రెడ్డిని అటు ప్రతిపక్షంలోనూ, ముఖ్యమంత్రిగా ఉన్నపుడూ అన్ని విషయాల్లోనూ అడ్డంకిగా పెద్దిరెడ్డి ఉన్నారని ఎన్నోసార్లు చెప్పారు. ఇటీవల ఓటిటి 'ఆహా'లో నందమూరి బాలకృష్ణ కార్యక్రమమైన 'అన్‌స్టాపబుల్' కార్యక్రమానికి తన స్నేహితులు, క్లాస్‌మేట్స్ అయిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, సురేష్‌రెడ్డిలను ఆహ్వానించారు. కార్యక్రమం ప్రోమో తెగ హల్‌చల్ చేస్తోంది.

చిత్తూరు జిల్లాలో నల్లారి కుటుంబానికి ఇద్దరు శత్రువులు ఉన్నారు. ఒకరు టీడీపీ అధినేత చంద్రబాబు అయితే మరొకరు సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. వైఎస్సార్ మరణం తరువాత పెద్దిరెడ్డే ప్రథమ శత్రువుగా మారిపోయారు. పెద్దిరెడ్డితో పెరిగిన వైరం నల్లారి కుటుంబాన్ని చంద్రబాబుకు దగ్గర చేసిందన్న టాక్ అయితే ఇటీవల వినిపిస్తుంది. అందుకు తగ్గట్టే కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిశోర్ కుమార్ రెడ్డి టీడీపీ గూటికి చేరారు. గత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగానే పోటీచేశారు. కానీ ఓటమి చవిచూశారు. నాడు కిరణ్ కుమార్ రెడ్డే తమ్ముడ్ని టీడీపీలో చేర్పించారని ప్రత్యర్థులు ఆరోపించారు. అయితే నాడు కిరణ్ ఎన్నిరకాల అండదండలు అందించినా కిశోర్ ను మాత్రం గెలిపించుకోలేక పోయారు. ఈసారి మాత్రం తమ్ముడి గెలుపునకు అస్త్ర శస్త్రాలు సిద్ధం చేస్తున్నారని ప్రచారం నడుస్తోంది.

తనకు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మధ్య బేధాభిప్రాయాలు సృష్టించింది ఓ మంత్రి అని కిరణ్‌కుమార్‌రెడ్డి తన మనస్సులో మాటను వ్యక్తపరిచారు. అయితే అది ముమ్మాటికీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డేనని నల్లారి కుటుంబ సన్నిహితులు చెబుతున్నారు. నాడు పెద్దిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి దక్కకుండా అడ్డుకున్నారన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అటు సిఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నపుడు జగన్‌తో తిరుగుబాటు చేయించింది కూడా పెద్దిరెడ్డేనని ఆరోపిస్తున్నారు. అందుకే పెద్దిరెడ్డిని టార్గెట్ చేసుకుని చిత్తూరు జిల్లాలో కిరణ్‌కుమార్‌రెడ్డి పట్టు బిగిస్తారన్న టాక్ అయితే ఇప్పటినుంచో ఉంది. ఇపుడు కిరణ్‌కుమార్‌రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించడంతో వచ్చే ఎన్నికల్లో తెరవెనుక ఉండి మంత్రి పెద్దిరెడ్డిని దెబ్బకొట్టేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం.

నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి ఏపీకి చివరి ముఖ్యమంత్రి. వైఎస్ మరణంతో రోశయ్య అనూహ్యంగా సిఎం పదవి చేపట్టాగా అక్కడకు కొద్దిరోజులకే కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ పదవిని అందిపుచ్చుకున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజన నిర్ణయంతో కిరణ్ విభేదించారు. సమైక్యాంధ్ర పార్టీ పెట్టినా పెద్దగా వర్కవుట్ కాలేదు. ఒక్క సీటు కూడా రాలేదు. దీంతో రాజకీయాలకు దూరంగా ఉండిపోయిన కిరణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే ఉన్నా ఏమంత యాక్టివ్‌గా లేరు. కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ జోడో యాత్రను సైతం పెద్దగా పట్టించుకోలేదు. కనీసం అటువైపు చూడవకపోవడంతో అసలు కాంగ్రెస్‌లోనే ఉన్నారా? లేకుంటే ఏదైనా పునరాలోచన చేస్తున్నారా? అన్నది మాత్రం అంతుపట్టడం లేదు. కాంగ్రెస్‌లోనే ఉండి ఉంటే ఆయన తప్పనిసరిగా రాహుల్‌తో అడుగులు వేసుండేవారే. వ్యూహాత్మకంగానే మౌనం పాటిస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు మీడియాకు సైతం దూరంగానే ఉన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి

ఏకలవ్య పాఠశాలలో 'కళ్లకలక'

వందమంది విద్యార్థులకు ఎర్రబారిన కళ్లు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

జిల్లాలో మద్రాస్ ఐ (కళ్లకలక) ప్రబలుతోంది.. ఈ వ్యాధి ఒకరి దగ్గర నుంచి ఇంకొకరికి క్షణాల్లో వ్యాప్తి చెందుతుంది. బిఎన్ కండ్రిగ మండలం ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు వందమందికి పైగా ఈ వ్యాధి విస్తరించడంతో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు వందమంది విద్యార్థులను ఒకే గదిలో ఉంచడం విమర్శలకు తావిస్తోంది. ఎక్కడ తమ పిల్లలకు వస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న విలేకరులు పాఠశాలలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను వివరణ అడగ్గా 'మా పిల్లల్ని ఎలా చూసుకోవాలో మాకు తెలుసు.. మీరు లోనికి రావడానికి వీల్లేదు.. బయటకు వెళ్లండి' అని కఠవుగా మాట్లాడటం గమనార్హం. ఈ విషయాన్ని విలేకరులు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహించడమే గాకుండా, జాగ్రత్తలు సూచించాలని కోరారు. ఒక్క ఏకలవ్య పాఠశాలే కాకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ వ్యాధి ప్రబలింది. మందులతో పిల్లలకు కాస్త ఊరట కలిగిస్తున్నారు. ఇకనైనా ఉపాధ్యాయులు స్పందించి మద్రాస్ ఐ తో బాధపడుతున్న విద్యార్థులను ఇళ్లకే పరిమితం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే హాస్టళ్లలో ఉండే పిల్లలకు సైతం వైద్య పరీక్షలు నిరంతరాయంగా అందించాల్సి ఉంది.

ఒకే గదిలో 'కళ్లకలక'తో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

క్రీడాకారిణికి మంత్రి రోజా ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహిళా క్రీడాకారిణికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి ఆర్.కె.రోజా పుత్తూరు మున్సిపాలిటీ నందిమంగళం గ్రామానికి చెందిన క్రీడాకారిణి కుమారి పావనికి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. తిరుపతిలోని డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పావని ఉత్తరప్రదేశ్‌లో నవంబర్ 22వ తేదీన జరిగే జాతీయ క్రీడలకు, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో డిసెంబరు 1వ తేదీన ప్రారంభమయ్యే రాక్ క్లైంబింగ్ అండ్ ట్రెక్కింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యారు. పావని వినతి మేరకు ఈ శిబిరాలకు ప్రయాణం, వసతి, ప్రవేశరుసుం, మెస్సింగ్, ఇన్‌సిడెంట్, ఇన్‌స్ట్రక్టర్ ఛార్జీలు, రైల్వే టిక్కెట్లు నిమిత్తం రూ.15వేలను రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు.

పుస్తకాలు..విజ్ఞాన కల్పవృక్షాలు..

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుస్తకాలు విజ్ఞాన కల్ప వృక్షాలని ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రేరణ వేదిక కార్యక్రమం సోమవారం కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రముఖ రచయిత సుబ్రహ్మణ్యం నాయుడు తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సాకం నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాసన్ రెడ్డి. నాగ మునికుమార్, గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, టీ.నరసింహులు, కోటేశ్వరయ్య, వి.వీరయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ : మండలంలోని పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటిగా కలియబెట్టు ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థిని విద్యార్థులను చదువులు గురించి కొన్ని విషయాలు చర్చించి వారికి చదువుపై, క్రీడల పట్ల అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల హోంవర్క్ పరిశీలించారు. అలాగే మొక్కలుచేను ఎంపీపీ స్కూల్‌లో ఆయన తనిఖీ నిర్వహించి విద్యార్థుల బాగోగులు, చదువును గురించి ఉపాధ్యాయులను, పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వారికి కావలసిన సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం కళ్లివెట్టు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి వారితోపాటు భోజన కార్యక్రమం ముగించారు. అక్కడ మధ్యాహ్న భోజనాన్ని ఇంకా రుచికరంగా ఉండాలని మధ్యాహ్నం భోజన సిబ్బందికి సలహాలు ఇచ్చారు.

నల్లపరెడ్డి వినోద్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కోట: వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ కోట మండల పరిషత్ అధ్యక్షుడు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా నల్లప రెడ్డి అభిమానులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కోట పట్టణంలో పోటాపోటీగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వినోద్ రెడ్డి ఇంటివద్ద జన్మదినవేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున ఏర్పాటు చేసి సంబరాలు జరుపుతున్నారు. అభిమానులు భారీ కేకులను వినోద్‌రెడ్డి చేతుల మీదుగా కట్ చేయించి పంచిపెట్టారు.

'చంద్రబాబును చూసి వైసీపీ ఓర్వలేకపోతోంది'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన అశేష జన ఆదరణ చూసి అధికార పార్టీ నేతలకు మింగుడు పడటం లేదని, అందుకే ఆయనపై మంత్రులు ఎమ్మెల్యేలు కుట్ర ప్రచారాలు చేస్తున్నారని టిడిపి తిరుపతి పట్టణ నాయకులు ఆముదాల తులసి రామ్ విమర్శలు గుప్పించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కర్నూలు పర్యటనలో అధికార పార్టీ కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేసేలా పథకం రచించారన్నారు. అప్ర జాస్వామికంగా వెళితే ప్రజలు ఊరుకోరని, మరొకసారి చంద్రబాబును విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

ముగిసిన చైల్డ్‌లైన్ సే దోస్తీ వారోత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బాలల దినోత్సవం సందర్భంగా గత వారం రోజులుగా అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్, రాష్ట్రీయ సేవా సమితి, ప్రజా ప్రగతి ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ సే దోస్తీ నినాదంతో తిరుపతి నగర పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని చైల్డ్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ జ్యోతి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులను అరికట్టడం కోసం, బాల కార్మికుల నిర్మూలనకై బస్టాండ్, రైల్వే స్టేషన్, జనసమూహ ప్రాంతాలను ఎంపిక చేసుకొని వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ నాగమణి, రైల్వే కో-ఆర్డినేటర్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్మన్ అమర్నాథ్ రెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-రేణిగుంట: కడప జిల్లా జెడ్పీ ఛైర్మన్ అమర్నాథ్ రెడ్డికి సోమవారం కేశవరెడ్డి విద్యాసంస్థలు, ఘనంగా స్వాగతం పలికారు. దాదాపు మూడు రోజులుగా సాగుతున్న పాదయాత్రలో భాగంగా, అమర్నాథ్ రెడ్డి, కేశవరెడ్డి పాఠశాల కుక్కల దొడ్డికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా, కాలినడకన 3000 మంది భక్తులతో కలిసి పాదయాత్ర చేయడం జరుగుతుందన్నారు. డిప్యూటీ సీఎం అంజాద్ భాష, కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు , భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

డాక్టర్ పద్మజకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- తొట్టంబేడు: తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ పద్మజ ఆర్ఎంఒగా ఉద్యోగోన్నతి పొంది అనంతపురం సర్వజన ఆస్పత్రికి ఆమె బదిలీ అయ్యారు. ఏర్పేడులో పనిచేస్తున్న డాక్టర్ ప్రసాద్ రెడ్డి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజను ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఘనంగా సత్కరించి ఆమెను దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఆమెతో పాటు బదిలీపై వెళ్లిన స్టాఫ్ నర్స్ లావణ్యను కూడా సన్మానించారు. డాక్టర్ రమేష్, ప్రసాద్ రెడ్డి సిహెచ్ఓ రత్నాకర్, పీహెచ్ఎన్ సంపూర్ణ, హెల్త్ సూపర్వైజర్ కామరాజు, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను హేతువాదదృష్టితో చూడాలి

ప్రభుత్వానికి హేతువాద సంఘం సూటి ప్రశ్న

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎదుటివారికి ఏ శక్తి లేదని తెలిసి కూడా బాబాలుగా అవతారాలు ఎత్తిన వారి దర్శనాలకు క్యూలు కడుతున్నారని, ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని బాబాలుగా అవతారమెత్తిన వారిపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నేడు మూఢనమ్మకాలను ప్రజలు ఎక్కువగా నమ్ము తున్నారని వాస్తవిక దశలో సంఘట నలను చూడలేని పరిస్థితులు సమాజంలో నెలకొన్నాయన్నారు. కల్కి ఆశ్రమం ఏర్పాటులో ప్రభుత్వ భూమిని నాలుగు ఎకరాలు ఆక్రమించుకున్నారని అప్పట్లో జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లినా నేటి వరకు దీనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని మండల రెవెన్యూ అధికారుల తీరుపై హేతువాదసంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తుందన్నారు.

కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని నీలకంటేశ్వర స్వామి ఆలయం వద్ద చాముండేశ్వరి దేవాంగ చేనేత సంక్షేమ సంఘం అధ్వర్యంలో కార్తికవనభోజనాలు నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి పైగా సహపంక్తి భోజనాలు చేశారు. తిరుపతి జిల్లా వైఎస్ఆర్సిపి బీసీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఆప్కో డైరెక్టర్ మిద్దెల హరి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి)చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి హాజరయ్యారు. సమానత్వానికి ప్రతీకగా వన భోజనాలు నిలుస్తాయని అతిథులు అన్నారు.

సాగు...సాగేనా..?

వ్యవసాయ మీటర్లపై రైతుల్లో ఆందోళన


వ్యవసాయ పంపుసెట్లు



ప్రజాశక్తి - బాలాయపల్లి: ఓ వైపు బిజెపి పాలిత ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లో రైతులు వ్యవసాయ మీటర్లను అడ్డుకుంటున్నారు.. మరోవైపు రాయచోటి జిల్లాలో స్మార్ట్ మీటర్లు కాలిపోతున్నాయన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు 'స్మార్ట్ మీటర్ల'పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ అధికారులు తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహించి, వ్యవసాయ మీటర్ల కోసం అన్నదాతల నుంచి దరఖాస్తులను బలవంతంగా సేకరిస్తున్నారు. దరఖాస్తు ఇవ్వని పక్షంలో మోటార్లే ఉండవని బెదిరిస్తుండడంతో గత్యంతరం లేక రైతులు దరఖాస్తులను అందజేస్తున్నారు. ఇప్పటికే తిరుపతి జల్లాలో 90శాతం పైనే దరఖాస్తులను సేకరించారు. ఇక మీటర్లు పెట్టడమే తరువాయి. మంత్రి పెద్దిరెడ్డి సైతం మార్చి లోపు వ్యవసాయ మీటర్లను అమర్చాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో త్వరలోనే తిరుపతి జిల్లాలోనూ వ్యవసాయ మీటర్లను అమర్చే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉచిత విద్యుత్‌తో పంటలు పండిస్తున్నా గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంటే వ్యవసాయ మీటర్లను అమర్చడం తమను మానసికంగా కుంగదీయడానికేనన్నది వారి ఆవేదన.

విద్యుత్ డివిజన్ పరిధిలో లక్షా 62వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. బాలాయిపల్లి మండలంలో 3,700, డక్కిలిలో 5,400, వెంకటగిరి రూరల్‌లో 7,856 కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ మీటర్లకు ప్రభుత్వం రాయితీ ఇస్తామని ప్రకటించినా, భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న సందేహాలు మొదలయ్యాయి. ఉచిత విద్యుత్ ఎత్తేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలు లేకపోలేదు. జగన్ సర్కారు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలనే ప్రతిపాదన వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం ఏ స్థాయిలో జరుగుతుందో అంచనా వేసేందుకేనని, మీటర్లను అమర్చి విద్యుత్ ఆదా కలిగించే పంపుసెట్లను రైతులకు అందజేస్తామని ప్రకటించారు. వర్షాధార జిల్లా అయిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మోటార్ల వినియోగం ఎక్కువగానే ఉంటుంది. నగదు బదిలీ పేరుతో ఎక్కడ తమను వేధింపులకు గురిచేస్తారోనని రైతులు వాపోతున్నారు.

కరెంటు మీటర్లకు రక్షణ ఎవరు..?

పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న పైపులు, మోటార్లను దుండగులు ధ్వంసం చేస్తున్నారు. మోటార్లు, స్టాటర్లను ఎత్తుకెళ్లిన ఘటనలూ లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మీటర్లకు రక్షణ ఎవరిదన్నది రైతుల ఆందోళన. సాంకేతిక మీటర్లకు సిగ్నల్స్ లేక పనిచేయకపోతే మాన్యువల్ రీడింగ్ నమోదు చేయాలి. గడువులోపు బిల్లులు జారీ చేసే పరిస్థితి ఉండదు. ఈ ప్రభావం రీడింగ్‌పై పడుతుంది. ఉచిత విద్యుత్ ఇచ్చేటపుడు మీటర్లెందుకో అర్థం కావడం లేదని రైతుసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఆశ వదులుకోవాల్సిందే : లోకేష్‌నాయుడు, సుబ్రమణ్యం, బాలాయిపల్లి

ఇక వ్యవసాయంపై ఆశలు వదులుకోవాల్సిందే. ప్రస్తుతం నెలకు రూ.30 చెల్లిస్తున్నాం. ఒకవేళ విద్యుత్ మీటర్లు బిగిస్తే రూ.1500 పైగా బిల్లు వస్తుంది. ఇప్పటికే పంటల దిగుబడి లేక, అప్పులు చెల్లించలేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం పంట నష్టపరిహారం సకాలంలో ఇవ్వడం లేదు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించి మీటర్లు బిగిస్తే వ్యవసాయంపై ఆశలు వదులుకోవాల్సిందే.

అలా ఇచ్చి ఇలా లాక్కుంటారు.. : నోసిన మీరయ్య, నెర్నూరు, గూడూరు రూరల్

వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించడం రైతులకు కొత్త తలనొప్పి. ఆర్థిక భారం తప్పదు. రెండెకరాల రైతులకు ప్రభుత్వం ఉచిత బోర్లు వేస్తామని చెబుతోంది. మీటర్లు బిగించడం అంటే కుడిచేత్తో ఇచ్చి ఎడమ చేత్తో లాక్కోవడమే.

పాత పద్ధతే బెటర్ : మస్తాన్, మిట్ట బాలాయపల్లి

వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించి నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తామనడంలో రైతును మోసగించే కుట్ర దాగి ఉంది. మీటర్ల ఏర్పాటుతో నష్టం కలుగుతుంది. పాత పద్ధతే కొనసాగించి రైతులను ఆదుకోవాలి. ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలి. జీవో 22 రద్దు చేయాలి.

మీటర్లు ఇంకా రాలేదు : జహీర్ అహ్మద్, ఎఇ, బాలాయపల్లి

మీటర్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతి పత్రాలను రైతుల నుంచి సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. వ్యవసాయ సర్వీసుల మీటర్లు ఇప్పటివరకు జిల్లాకు రాలేదు. ఈ అంశంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు.

సీనియర్ జర్నలిస్టు శశిధర్ మూర్తిపై విచారణ జరపాలి

కలెక్టర్‌కు జర్నలిస్టు సంఘాల వినతి

కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తున్న తిరుపతి జర్నలిస్టులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సీనియర్ పాత్రికేయుడు బిఎం శశిధర్ మరణం పట్ల విచారణ జరిపించాలని వివిధ జర్నలిస్టుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తిరుపతి ప్రెస్‌క్లబ్ సభ్యులు వివిధ జర్నలిస్టుల సంఘాల నేతలు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతికి చెందిన బి.ఎం. శశిధర్, సీనియర్ పాత్రికేయుడిగా వివిధ సంస్థలలో పనిచేసి - గుర్తింపు పొందారని, నవంబర్ 8వ తేదిన బి.ఎం. శశిధర్ మృతి చెందాడని తెలిపారు. ఈ మృతిపై పాత్రికేయులమైన తమకు పలు సందేహాలు న్నాయని, అనారోగ్యంతో వున్న వ్యక్తిపై అభియోగాలు మోపడం.... అతనికి వైద్యం అందించకపోవడం... సకాలంలో అధికారులు, పోలీసులు స్పందించకపోవడం వంటి అంశాలపై తమరు తగు విచారణ జరిపించి తమ అనుమానాలను నివృత్తి చేయగలరని, బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీధర్ మోహన్ రావు, దినేష్ ,మూర్తి, ప్రసాద్, తులసీరామ్, పద్మనాభం ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు, ప్రింట్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణుల పట్ల నిర్లక్ష్యమెందుకు: ఐద్వా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: డెలివరీ కోసం వచ్చిన గర్భిణులను ప్రసూతి ఆసుపత్రి సిబ్బంది గెంటి వేయడం తగదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయంతి, పి.సాయి లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయంతి, సాయిలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు అనంతరం మహిళను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.విజయలక్ష్మి, ఎ.నీరజ, గీత, నందిని పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణీని పరామర్శించిన సుగుణమ్మ

ఇదేం ఖర్మ తిరుపతి ఘటనతో హృదయం చలించిపోతుంది. నడిరోడ్డుపై మహిళ ప్రసవం గుండెను కలచివేస్తుంది. తోడుగా సహాయకులు లేరని పురిటి నొప్పులతో వచ్చిన మహిళలను ప్రసూతి ఆసుపత్రి సిబ్బంది చేర్చుకోకపోవడం దారుణమని టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. సోమవారం ప్రసూతి హాస్పిటల్‌లో ఉన్న మహిళను ఆమె పరామర్శించారు.

ప్రజాభివృద్ధికే మా ముందడుగు: ఎమ్మెల్యే భూమన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రజాభివృద్ధికే మా ముందడుగు అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు.

భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టండి

నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాత మెటర్నిటీ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన మునిసిపల్ కార్యాలయాన్ని, సోమవారం మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలసి ఎమ్మెల్యే అన్ని ఛాంబర్లను పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులతో మాట్లాడి అన్ని వసతులు ఉన్నాయా, ఇంకా ఏమైనా కొరత ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత మునిసిపల్ ఆఫీస్ వద్దకు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు ఆలస్యంగా జరుగుతుండటంతో కూల్చివేత పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, ఆంజనేయులు, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, దేవిక, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్, ఎస్పీ, టీటీడీ జేఇఓలను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం

కలెక్టర్‌తో సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్, ఎస్పీ, టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సోమవారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని కలెక్టర్ వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇంటి పట్టాలు, శ్మశాన సమస్యలను కలెక్టర్‌తో చర్చించి, పరిష్కారం కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అక్కడనుండి ఎస్పీ కార్యాలయానికి చేరుకుని నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్యలు, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో తలెత్తే సమస్యలను వివరించారు. అనంతరం టిటిడి పరిపాలన భవనానికి చేరుకుని జేఇఓ వీరబ్రహ్మంను కలిశారు. సత్యవేడులో టిటిడి కళ్యాణ మండపం భూమి పూజపై ఆయనతో చర్చించారు. త్వరితగతిన కళ్యాణ మండపం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయనను కోరారు. అలాగే ప్రాచీన టిటిడి ఆలయాలైన నారాయణవనం కళ్యాణ వెంకటేశ్వర స్వామి, అవనాక్షమ్మ ఆలయాలతో పాటు, నాగలాపురంలోని శ్రీ వేద నారాయణ స్వామి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. తన వినతులపై కలెక్టర్, ఎస్పీ సహా టీటీడీ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

అర్హులైన రైతులకు ఈ నెల 29న వడ్డీలేని రుణాలు

ప్రజాశక్తి-నాయుడుపేట: గౌరవ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 29వ తేదీన వడ్డీ లేని రుణాలను అర్హులైన పేద రైతుల ఖాతాలలో వేయనున్నారు. అర్హులైన రైతులకు లక్ష వరకు రుణాలను విడుదల చేస్తున్నారని నాయుడుపేట మండలంలో 749 మంది రైతులు ఈ రుణాలకు అర్హత కలిగి ఉన్నారని నాయుడుపేట మండలానికి 12.71లక్షలు విడుదలయ్యాయని నాయుడుపేట ఏఓ జోగి. గణేష్ తెలియజేశారు. రుణం పొందిన రైతులు సంవత్సరం లోపు వడ్డీతో సహా వారి బ్యాంకులలో రుణం మొత్తాన్ని జమచేస్తే వారికి జమచేసిన వడ్డీని తిరిగి వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ పేర్లను చెక్ చేసుకుని ఒకవేళ తమ పేర్లు జాబితాలో లేని పక్షంలో సంబంతిత వీఏఏలను కానీ మండల వ్యవసాయ అధికారులను కానీ సంప్రదించగలరని నాయుడుపేట ఏ ఓ తెలియజేశారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో గిరిజన కాలనీలో సొల్లేటి వెంకటసుబ్బయ్య దాతృత్వంతో సోమవారం 50 మందికి దుప్పట్లను రోటరీ వెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. సీనియర్ రొటేరియన్స్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాసిన నాగులు సిద్ధారెడ్డి, వెంకటసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి బలరాం రెడ్డి, పాల్గొన్నారు.

దిక్సూచి పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ ఉన్నత పాఠశాల, మనుబోలులో 10వ తరగతి పిల్లలకు గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ సహకారంతో దిక్సూచి పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

23న జాబ్ మేళా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 23న తిరుపతి ఖజానా జ్యువెలరీలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిఆర్డీఏ పథక సంచాలకులు జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఖజానా జ్యువెలరీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్ మొత్తం 50 ఖాళీలకు ఇంటర్వ్యూలను నిర్వహిసామన్నారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చదివి 18 నుండి 30 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగులు 23వ తేదీ ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సర్టిఫికెట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లకు 17 వేలు, క్యాషియర్లకు 18 వేలుగా జీతభత్యాలు ఉంటాయన్నారు.

తహశీల్దార్ శివప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ సర్వీస్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సందర్భంగా రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్‌నిఉమ్మడి చిత్తూరు జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాలాజీ రెడ్డి, నాగరాజు ఆధ్వర్యంలో తహ శీల్దార్ శివప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

పోలిరెడ్డిపాలెం గ్రామంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం గ్రామంలో ఉన్న సచివాలయం వద్ద సోమవారం డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో 104 సేవలు ద్వారా రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 104 వైద్యులు కిషోర్, హెల్త్ అసిస్టెంట్ రత్నయ్య, ఎంఎల్‌హెచ్‌పిహెచ్ గాయత్రి, ఏఎన్ఎం రుక్మిణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అల్పపీడనంపై ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కోట : నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారిన అల్పపీడనం కారణంగా గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోట తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఒ భవాని లు అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం కోట ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వాతావరణంపై పలు సూచనలు, సలహాలను అందజేశారు.

బాలాయపల్లి: తుఫాను కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల శాఖ అధికారులు మండల కేంద్రంలోనే ఉండాలని తహశీల్దార్ అజ్మతుల్లఖాన్ అన్నారు. సోమవారం తుఫానుపై సమీక్ష నిర్వహించారు.

నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు:ఎంపీడీవో

తుఫాను బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోనే ఉండాలని ఆదేశించారు.

పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-పాకాల: పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెడితే విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడుతుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రియాంజలి, వంశిక, సురేష్ అభిప్రాయపడ్డారు. వారు సోమవారం దామలచెరువు ఉన్నత పాఠశాల,పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెడితే ఎలా ఉంటుందో తల్లిదండ్రులు, విద్యార్థుల దగ్గర అభిప్రాయ సేకరణ చేస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థుల దగ్గర ఫీడ్ బ్యాక్ కూడా తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు నాగరాజ, ఉపాధ్యాయులు, సచివాలయ విద్యా సహాయకులు కార్తీక్, సి.ఆర్.పి. శ్రీనివాసులు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై..

ఇంటింటి సర్వే వేగవంతం చేయాలి

ఎంపీడీవో విజయకుమారి

ప్రజాశక్తి -సత్యవేడు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియను వేగవంతం పరచాలని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో విజయ కుమారి కోరారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే మండలంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నవంబర్ 14 నుంచి ఇంటింటి సర్వే ఆయా గ్రామ వాలంటీర్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

విద్యతోనే బాలల హక్కుల పరిరక్షణ

ప్రగతి డైరెక్టర్ కెవి రమణ

ప్రజాశక్తి-రేణిగుంట : బెంగళూరు వారి సహకారంతో ప్రగతి సంస్థ, తిరుపతి వారు సార్వత్రిక బాలల హక్కుల వారోత్సవాలను రేణిగుంట, ఏర్పేడు శ్రీకాళహస్తి మండలాల పరిధిలోని 55 గ్రామాలు, 18 ఉన్నత పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా రేణిగుంట గిరిజన గురుకుల పాఠశాలలో ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రగతి డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులందరికీ జామెంట్రీ బాక్సులు, అట్లాస్‌లను అతిథుల చేతుల మీదుగా బహూకరించారు.

ఆకట్టుకున్న కోలాట బృందం ప్రదర్శన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శ్రీపద్మావతి మహిళా కోలాట బృందం నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు డి.మహేష్ కోలాట బృందం గురువు యన్ ముకుందా ఆధ్వర్యంలో పుత్తూరు అంబేడ్కర్ సర్కిల్‌లో కోలాట ప్రదర్శన చేశారు. ప్రభుత్వం కళాకారులను గుర్తించి కళాకారులు అందరికీ గుర్తింపు కార్డులు పింఛన్లు అందించాలన్నారు. . తిరుమల తిరుపతి దేవస్థానం వారు కళాకారులను గుర్తించి కొండపైన ప్రదర్శన చేయడానికి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా కోలాట బృందం నాయకురాలు, ప్రభావతి, మునెమ్మ, సుజాత, మణెమ్మ దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గోపి, చంద్రశేఖర్, రవి, రమేష్, కృష్ణారెడ్డి, సర్వనా, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి నాని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పాకాల: టిడిపి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి పులివర్తి నాని జన్మదిన వేడుకలు సోమవారం మండలంలో పలుచోట్ల టిడిపి మండల అధ్యక్షుడు బోయపాటి నాగరాజు నాయుడు, టిడిపి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాకాల మండలం మొగరాలలో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దామలచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ, పలుచోట్ల అన్నదాన కార్యక్రమం చేసిన లంకిపల్లి గురప్ప చాణిక్య నాయుడు దంపతులు పంపిణీ చేశారు.

చిన్నగొట్టిగల్లు:తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పులివర్తి నాని జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సోమవారం చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం, మండలాల పార్టీ కన్వీనర్లు బెల్లంకొండ మురళి, దేశి రెడ్డి రఘునాథరెడ్డిల ఆధ్వర్యంలో పులివర్తి నాని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యం

గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సిన వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను రద్దు చేసి వారికి తీవ్ర అన్యాయం చేసిందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ విమర్శించారు. సోమవారం పుత్తూరు మున్సిపాలిటీ వినాయక పురం ఎస్టీ కాలనీలో ప్రజలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తే వాటిని పూర్తిగా రద్దు చేసిందని పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్న పుత్తూరు పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇ.హేమాద్రిని భానుప్రకాష్ పరామర్శించారు. పుత్తూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జి.జీవరత్నం నాయుడు, చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సి.షణ్ముగరెడ్డి, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, టౌన్ ఎస్టీ సెల్ అధ్యక్షులు హేమాద్రి, నాయకులు జానకిరామయ్య, ధర్మయ్య, ఆనంగి రమేష్ పాల్గొన్నారు.

విద్యతోపాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

ఎస్వీసీఈలో విద్యార్థి అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను కూడా అలవర్చుకోవాలని ఎస్వీసీఈ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ ఈసీఈ విభాగ ఆచార్యులు డాక్టర్ టి.రమాశ్రీ పేర్కొన్నారు. సోమవారం తిరుపతి- కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ స్వయం ప్రతిపత్తి సంస్థ (ఐఈటిఈ), విద్యార్థి అసోసియేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.రమాశ్రీ మాట్లాడుతూ విద్యార్థులలో పోటీతత్వం, సమాచారం నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఇటువంటి తరహా ఈవెంట్స్ ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈసిఈ విభాగాధిపతి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వే మొత్తం తప్పుల తడకగా ఉంది

విలేకరుల సమావేశంలో రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే మొత్తం తప్పులు తడకగా ఉందని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ నిబంధనలు అనుసరించకుండా ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో క్షేత్రస్థాయి అధికారులు ఇష్టం వచ్చినట్టు భూ సర్వే చేస్తున్నారని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర సలహాదారులు మాంగాటి గోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో భూ సర్వే చేశారని అటు తరువాత ఇప్పుడు భూముల రీ సర్వే పేరుతో రైతుల స్వాధీన అనుభవంలో ఉన్న భూములను తప్పులు తడకగా నమోదులు చేస్తూ రైతులను కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రీ సర్వేలో ఉత్పన్నమవుతున్న సమస్యలను సీసీఎల్ఏకు వివరించామని, తగిన సూచనలతో రీ సర్వేలో ఎటువంటి లోపాలు జరగకుండా చూసుకుంటామని సీసీఎల్ఏ, స్పెషల్ సిఎస్ సాయిప్రసాద్ తెలిపారన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO. 325/2022

షేక్ షర్మిల, సయ్యద్ అఫ్జల్. ...వాదులు

Vs

Nill. ...ప్రతివాదులు

జనరల్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై కోర్టులో ఎస్.కె.షర్మిల, ఎస్.డి.అఫ్జల్ అను వారు పరస్పర అంగీకారంతో (Mutual Divorce) విడాకులు పొందుటకు వాళ్ళ మత ఆచారం ప్రకారం దావా నెం.325/2022 అను దావాను దాఖలు చేసి ఉన్నారు. ఇందు నిమిత్తం ఎవరికైనా అభ్యంతరం ఉంటే తెలుపుకోవలసినదిగా కోర్టు వారు జనరల్ నోటీసు ఆర్డర్ చేసిఉన్నారు. కావున పైన తెలిపిన విషయంలో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నఎడల తేది: 5-12-2022న ఉదయం 10.30గంటలకు పై కోర్టు నందు మీరు నేరుగా గాని, లాయర్ ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని ఎడల కోర్టు వారు పైన తెలిపిన వారికి విడాకులు మంజూరు చేయుదురు.

కె.కొండలరావు, M.A.,L.L.B.,
వాదులు తరపున న్యాయవాది,
గూడూరు. సెల్: 8555014024.